అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక
సంపుటి: 01 సంచిక : 156. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.02.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెన్షన్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌పై ఆ పార్టీ సస్పెన్షన్ విధించింది. ఈ మేరకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ జి. చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కుల గణన ప్రతులను చించడంపై కాంగ్రెస్‌అధిష్టానంసీరియస్ అయింది.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనీ, దీనిపై నోటీసులిచ్చినా వివరణ ఇవ్వకపోవడంతో మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది.దీనిపైశనివారంటీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూఎంత పెద్ద నాయకుడైన సరే పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించామని తెలిపారు. బీసీ కులగణన ప్రతులు చించి వేయడంపై ఏఐసీసీ సీరియస్ అయిందని వివరించారు.

## ఎస్‌సీ కమిషన్‌లో ఖాళీల భర్తీపై నిర్లక్ష్యం

న్యూఢిల్లీ:అమృత్ తెలంగాణ: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌ను కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ దళిత వ్యతిరేక మనస్తత్వానికి ఇదొక రుజువు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దళితుల హక్కులను పరిరక్షించే ఎస్‌సీ కమిషన్‌లో రెండు కీలకమైన పదవులు ఖాళీగా వున్నాయని, గతేడాదిగా వీటిని భర్తీ చేయలేదని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థ అయిన ఈ కమిషన్‌ను ఇలా బలహీనపరచడమంటే దళితుల సామాజిక హక్కులపై, రాజ్యాంగ వ్యవస్థపై నేరుగా దాడి చేయడమేనని విమర్శించారు. సాధ్యమైనంత త్వరగా కమిషన్‌లోని అన్ని ఖాళీలను భర్తీ చేయాలని ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతమున్న కమిషన్ ఏడవది, దీన్ని గతేడాది మార్చి 9న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేశారు. ఛైర్‌పర్సన్‌ను, ఇద్దరు సభ్యులను నియమించారు. ఇతర సభ్యులను లేదా ఉపాధ్యక్షుడిని ఇంతవరకు నియమించలేదు.

# ఖనిజ అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమనీ, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచొచ్చని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని ఐసీసీసీలో గనుల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్నీ, పెరిగిన ఆదాయాన్ని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ఆ సంస్థ నుంచే సరఫరా చేయాలని ఆదేశించారు. సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా సరఫరా చేసే వారిపై వినియోగదారులు ఆధారపడరని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక వినియోగం ఎక్కువగా జరుగుతోందన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టీజీఎండీసీ ఛైర్మెన్ ఈరవత్రి అనిల్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.శేషాద్రి, కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ కె.శశాంక, గనుల శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

# బ్యాగులు మోయద్దనడం పెద్ద జోక్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బ్యాగులు మోసి సీఎం అయిన రేవంత్‌రెడ్డిని పక్కన కూర్చోబెట్టుకుని బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ రాష్ట్ర కొత్త ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కె.తారకరామారావు విమర్శించారు. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగులు మోస్తే ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ రెడ్డి బ్యాగులు మోస్తున్నారని ఆరోపించారు. మంచి మైక్‌లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలంటున్న రేవంత్ ఒక్క మంచి పని చేయలేదు కాబట్టే ఎవరూ మైక్‌లో చెప్పడం లేదని దెప్పిపొడిచారు. హైడ్రా విధ్వంసం, ఆర్‌ఆర్ ట్యాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, మొన్ననే కొట్టుకపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌస్ ఇలా చెప్పడం మొదలుపెడితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారటం ఖాయమన్నారు. శనివారం హైదరాబాద్‌లో చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండల మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డితో పాటు సుమారు 500 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్ రెడ్డిని తిట్టని వ్యక్తి లేరన్నారు. జనవరి 26న ఖాతాల్లో డబ్బులు పడతాయని హామీ ఇచ్చి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క పథకం కూడా అమలు చేయలేదని ఎత్తిచూపారు. కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో విధ్వంసం, అరాచకాలతో కుప్పకూలిందని విమర్శించారు. హైడ్రా, మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారన్నారు. మేడ్చల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య దురదష్టకరమని వాపోయారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా పది శాతం పనులు పూర్తిచేస్తే చేవెళ్లకు నీళ్లొస్తాయని గుర్తుచేశారు. కానీ, దాన్ని పక్కనపడేసి మూసీ సుందరీకరణ కోసం రూ.1,50,000 కోట్లు ఖర్చు చేసి కమీషన్లు దండుకొని, కాంగ్రెస్ అధిష్టానానికి పంపి తన పదవిని కాపాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు పాతాళంలోకి, నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయని ఎద్దేవా చేశారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలోనే రూ.1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క కొత్త పథకం కూడా ప్రారంభించలేదని విమర్శించారు. 450 మంది రైతులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా పట్టదా? అని నిలదీశారు. రాష్ట్రంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ కేసీఆర్ గెలిస్తేనే తెలంగాణ నిలబడుతుందని చెప్పారు.

# టన్నెల్‌లో కన్నీళ్లు....
# ఎనిమిది మంది ఆనవాళ్లు గుర్తింపు




మహబూబ్‌నగర్ : అమృత్ తెలంగాణ: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో 5-8 మీటర్ల మట్టిదిబ్బ కింద నలుగురి ఆనవాళ్లు ఉన్నట్టు స్కానింగ్‌లో కన్పించాయని, మరో నలుగురు టీబీఎం మిషన్ సమీపంలో ఉండే అవకాశం ఉందని మంత్రి జూపల్లి అన్నారు. మిషన్‌ను కట్ చేసి తునకలు బయటకు పంపుతున్నామని తెలిపారు. ఇది పూర్తయితే మిగతా నలుగురి ఆచూకీ లభించే అవకాశాలున్నాయన్నారు. సోమవారం వరకు మిగతా వారిని తీసుకురావడం జరుగుతుందన్నారు. లేకపోతే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. పేరుకుపోయిన మట్టిని తవ్వి బయటకు పంపుతున్నామని, లోపల ఎంత ప్రమాదకరంగా ఉంటుందో అక్కడికి వెళ్తే తెలుస్తుందని అన్నారు. కాళేశ్వరంలో 200 కిలోమీటర్ల సొరంగం తవ్వామని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అంటున్నారు.. మరి పదేండ్లలో ఎస్‌ఎల్‌బీసీలో 20 కిలోమీటర్ల టన్నెల్ ఎందుకు తవ్వలేదని ప్రశ్నించారు. గత పదేండ్లలోనే దీన్ని పూర్తి చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదేమో అని అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మిక కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిందిపోయి ప్రతిపక్షాలు మరింత దిగజారుడుగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. కార్మికులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పడం సరికాదన్నారు. మూడు షిఫ్టులలో 300 మందికి పైగా తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని సహాయక పనులు చేస్తున్నారని, మరికొందరు ప్రమాదంలో చిక్కుకోకూడదనే జాగ్రత్తగా ముందుకెళ్తున్నామని చెప్పారు.

ఆపరేషన్‌కు తెర..

టన్నెల్‌లో ఎనిమిది రోజులుగా రెస్క్యూ టీంల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కొలిక్కి వచ్చింది. గత శనివారం ఉదయం 8.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది సొరంగంలో చిక్కుకున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, సౌత్‌సంటర్ రైల్వే, ఆర్మీ, హైడ్రా, ర్యాట్ మైనర్స్, ఎల్‌అండ్‌టీ, నవయుగ, అమెరికా రాబిన్ కంపెనీల బృందాలు షిఫ్టులలో సుమారు 300 మందికిపైగా తీవ్రంగా శ్రమించి ఆపరేషన్ చేపట్టారు. 14 కిలోమీటర్ల సొరంగంలో రెస్క్యూ టీంలు 13.50 కిలోమీటర్ల వరకు పోయాయి. ఆ తర్వాత నల్లమల గుట్టల నుంచి వచ్చే నీరు, మట్టి పేరుకుపోవడంతో మరో అర కిలోమీటరు ముందుకు పోవడం కష్టంగా మారింది. అక్కడే 9.2 మీటర్ల వెడల్పు ఉన్న టన్నెల్‌లో ఐదున్నర అడుగుల ఎత్తులో బురద, మట్టి పేరుకున్నది. టీబీఎం మిషన్‌తో గ్యాస్ కట్టర్లతో తునకలు చేసి పైపులతోపాటు ఇతర సామగ్రిని బయటకు పంపారు. అయితే శుక్ర, శనివారం సాయంత్రానికి జీపీఆర్ మిషన్ పరికరంతో స్కానింగ్ చేయగా.. ఘటనా స్థలంలో ఎన్‌జీఆర్‌ఐ నిపుణులు డీ కోడ్ చేశారు. రేడియో తరంగాల ద్వారా భూగర్భంలోని వస్తువుల అవశేషాలను ఇది గుర్తించింది. టీబీఎంతోపాటు ఇతర ప్రదేశాల్లో మనిషి ఆనవాళు కనిపించినట్టు సహాయక బృందాలు తెలిపాయి.

సొరంగం చివర మిషన్ ఉన్న ప్రాంతంలో నీరు ఉబికి వస్తోంది. దీంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. అయినా సిబ్బంది శ్రమటోడ్చి బురదను తీస్తూ.. నీటిని బయటకు పంపిస్తూ కార్మికులను బయటకు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. అయితే, 14 కిలోమీటర్ల సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకోవడమే సాహసం అని చెప్పొచ్చు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించడం పట్ల ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. అయితే, గల్లంతైన వారిలో గుర్తించిన నలుగురిని ఆదివారం బయటకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. మరో నలుగురిని ఆదివారం రాత్రి లేదా సోమవారానికి బయటకు తీసుకొస్తామని అంటున్నారు. ఇందులో అందరూ చనిపోయి ఉంటారని అంటున్నారు. అధికారికంగా బయటకు చెప్పకున్నా.. అనధికారికంగా బాధిత కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేసినట్టు తెలుస్తోంది. టన్నెల్ బయట కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

సొరంగంలో చిక్కుకున్న కార్మికుల వివరాలు

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పీఇ మనోజ్‌కుమార్(50). ఇతను 16 ఏండ్లుగా వివిధ ప్రదేశాల్లో సొరంగం పనులు చేశారు. అదే రాష్ట్రానికి చెందిన ఎఫ్ఇ శ్రీనివాస్(40) వీరు సొరంగం పనుల్లో నిష్ణాతులు. వీరు సొరంగం పనుల్లో ఇంజినీయర్లుగా పనిచేస్తున్నారు. జార?ండ్‌కు చెందిన సందీప్ సాహు, జటాక్స్ సంతోష్ సాహు, అనూజ్‌సాహు, సన్నీ సింగ్, గురుప్రీత్ సింగ్ (మరొకరి పేరు తెలియాల్సి ఉంది) ప్రమాదంలో చిక్కుకుని బురదలో కూరుకుపోయారు.

సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది చనిపోయినట్టు తెలుస్తోంది. దీనిపట్ల ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలి. పనులు చేస్తున్న సమయంలో ముందస్తు జాగ్రతలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరిగేవికావు. ఆపరేషన్ పూర్తి చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కంపెనీ యాజమాన్యాలు పరిహారం చెల్లించాలి.

# మామునూరు ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు పనుల్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. కొచ్చి విమానాశ్రయం తరహాలో సౌకర్యాలు, నమూనా ఉండాలని సూచించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన మామునూరు ఎయిర్‌పోర్టుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎంపీలు కావ్య, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. భూసేకరణ, పెండింగ్ పనుల్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, ఎయిర్‌పోర్టు వద్ద నిత్యం యాక్టివిటీ ఉండేలా డిజైనింగ్ చేసి పంపాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్ నగరానికి ప్రధాన ఆస్తిగా ఉండేలా విమానాశ్రయ నిర్మాణం ఉండాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రతినెలా తనకు నివేదికలు పంపాలని చెప్పారు. మామునూరు విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగల్ ఇచ్చేలా కృషి చేసిన సీఎంకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ధన్యవాదాలు తెలిపారు.

# ఈసీ, నకిలీ ఓట్ల సాయంతో బీజేపీ గెలుస్తుంది : మమతా బెనర్జీ



కోల్‌కతా :అమృత్ తెలంగాణ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఫేక్ ఓట్లను సృష్టించి అధికారంలోకి వస్తుంది. దీనికి ఎన్నికల సంఘం కూడా బీజేపీకి పూర్తిగా మద్దతిచ్చి సహకరిస్తుందని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని మమతాబెనర్జీ ఆరోపణలను శనివారం పశ్చిమబెంగాల్ ఎలక్టోరల్ ఆఫీసర్ చీఫ్ తోసిపుచ్చారు. సిఎం దీదీ వ్యాఖ్యలపై చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తాజాగా పోస్టు చేశారు. 'రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1951 (ఆర్‌పి) చట్టం ప్రకారం ఓటర్ల నమోదు జరుగుతుంది. 1960 ఎలక్టోరల్ రూల్స్ ప్రకారం బిఎల్‌ఓ, ఎఇఆర్‌ఓ, ఇఆర్‌ఓ, డిఇఓ, సిఇఓలు ఎలక్టోరల్ రోల్స్ అప్‌డేషన్ కోసం పనిచేస్తారు. ఇది రాజకీయ పార్టీలచే నియమించిన బూత్‌స్థాయి ఏజెంట్ల క్రియాశీల భాగస్వామ్యంతో జరుగుతుంది. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ముందుగా 80,633 బిఎల్‌ఓ, 3,049 ఇఆర్‌ఓలకు చెప్పాలి' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ గురువారం బీజేపీపై ధ్వజమెత్తారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కూర్చొని ఆన్‌లైన్‌లో నకిలీ ఓటర్ల జాబితాను రూపొందించి, పశ్చిమ బెంగాల్‌లోని ప్రతి జిల్లాలో నకిలీ ఓటర్లను చేర్చారు. ఈ ట్రిక్‌ను ఉపయోగించి ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ వాస్తవాలను మహారాష్ట్రలోని ప్రతిపక్షపార్టీలు కనిపెట్టలేకపోయాయి. ఈ రాష్ట్రాల్లో హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన నకిలీ ఓటర్లే ఎక్కువ. ఇసి (ఎన్నికల సంఘం) ఆశీస్సులతో బిజెపి నకిలీ ఓటర్ల జాబితాను సృష్టిస్తోంది. ఈ చర్యకు ఇసి బీజేపీకి పూర్తిగా సహకరిస్తుంది. ఈ సంస్కృతిని టిఎంసి వ్యతిరేకిస్తోంది. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరగాలని టిఎంసి నినదిస్తుంది' అని ఆమె అన్నారు. అలాగే ఎన్‌ఆర్‌సి, సిఎఎ పేరుతో ఓటర్ల జాబితాలో మీ పేర్లను ఏరోజు అయినా తొలగించవచ్చు. టిఎంసి ఓడించాలనే లక్ష్యంతో బిజెపి ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది. ప్రధానంగా డేటా ఆపరేటర్లపై నిఘా పెంచాలి. దీనికి టిఎంసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి. దీనికి ముందుగా నకిలీ ఓటర్ల జాబితా లేకుండా చేయాలి. ఇది బూత్ లెవల్లో జరగాలి. దీనికి జిల్లా అధ్యక్షులు శ్రద్ధ వహించాలి అని ఆమె అన్నారు.

# ఇద్దరు మావోయిస్టుల ఎన్‌కౌంటర్



కిష్టారం: అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి తుపాకీ మోతలతో దద్దరిల్లింది. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్టు సమాచారం అందడంతో కోబ్రా, డీఆర్జీ, జిల్లా బలగాల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తారసపడ్డ మావోయిస్టులు భద్రతాబలగాలపై కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన సుమారు 500 మందితో కూడిన భద్రతా దళాలు నలుదిక్కుల నుంచి మావోయిస్టులను చుట్టుముట్టాయి. మావోయిస్టుల కాల్పులతో అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఇరు వర్గాల మధ్య నాలుగు విడతలుగా కాల్పులు జరిగాయి. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలో పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ఇద్దరు మావోయిస్టులతో పాటు వారికి సంబంధించిన మారణాయుధాలు, ఇతర వస్తు, సామాగ్రిని భద్రతా దళాలు స్వాధీనపరుచుకున్నాయి. మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు ఉన్నట్టు సమాచారం. భద్రత దళాలు ఆ ప్రాంతంలో మావోయిస్టుల కోసం ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

## అంగరంగ వైభవంగా పార్డి బి రాజరాజేశ్వర ఆలయంలో అంబల్ల సంబరాలు: పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు....



రాజరాజేశ్వర ఆలయంలో అంబల్ల సంబరాల్లో పాల్గొన్న నాయకులు



రాజరాజేశ్వర ఆలయం లైట్లతో వెలిగిపోతున్న దృశ్యం



పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

నిర్మల్ జిల్లా కుబీర్, మార్చ్ 1 అమృత్ తెలంగాణ కుబీర్, మండలంలోని పార్డి బి శ్రీ రాజరాజేశ్వర ఆలయం నందు ప్రతి సంవత్సరం శివరాత్రి పండుగ పురస్కరించుకొని ఐదు రోజుల పాటు, అభిషేక అర్చనలు, శివపార్వతుల కళ్యాణము, అంబల్ల సంబరాలు, కుస్తీ పోటీలు జరగడం ఆనవాయితీగా వస్తుంది. అదే విధంగా శనివారం నాలుగవ రోజున సాయంత్రం 6:30 గంటలకు అంబల్లను ఎత్తుకొని పెద్ద ఎత్తున ప్రజలు రావడం జరిగింది. కోరిన కోరికలను నెరవేర్చే శ్రీ రాజరాజేశ్వరుని దర్శించుకుని, స్మరించుకున్నట్లయితే భక్తుల మొక్కులు కొంగుబంగారం అవుతాయని నమ్మకం. శనివారం జరిగిన అంబళ్ల కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ రోజటి కార్యక్రమంలో భాగంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి, మాజీ ఎంపీపి బోయిడి విట్టల్, మాజీ జెడ్పిటిసి వాల్కేర్ మోహన్, గ్రామ పెద్దలు తూము రాజేశ్వర్, చిమ్మన్ పోశెట్టి, మల్లు, శేరి సురేష్,మేర నరేందర్ కుబీర్,పలువురు ప్రజాప్రతినిధులు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## ప్రభుత్వ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ అధికారి



పిల్లలను అడిగి తెలుసుకుంటున్న ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జాదవ్ అంబాజీ

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 1 అమృత తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్టి బయాస్ వసతి గృహాన్ని శనివారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జాదవ్ అంబాజీ, అతనికి చేశారు. హాస్టల్ లో సమకూరుస్తున్న సౌకర్యాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు శివాజీ సిబ్బంది పాల్గొన్నారు

## మా అమ్మ నాన్న ఫౌండేషన్ సేవలు అమోఘం

### లోకేశ్వరం తాసిల్దార్ మోతిరాం . చేతుల మీదుగా యాభై మంది నిరుపేదలకు నూతన బట్టల పంపిణీ..........



అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నూతన బట్టలను అందజేస్తున్న తాసిల్దార్ మోతిరం



నూతన వస్త్రాలను అందుకున్న నిరుపేద కూలీలు

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మార్చ్ 1 అమృత్ తెలంగాణ లోకేశ్వరం మండల్ మొహాల గ్రామంలో శనివారం రోజు మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు, కూతురు అల్లుడు సుమిధ్ కుమార్, 2 వ పెళ్లిరోజును పురస్కరించుకొని లోకేశ్వరమ్ మండలం మోహాలా గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లోకేశ్వరం తహశీల్దార్ మోతిరాం హాజరై మహారాష్ట్ర వలస కూలీలకు దాదాపు 50 మందికి నూతన బట్టల పంపిణీ చేయడం జరిగింది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా ఆంజనేయులు చేస్తున్న సేవలను కొనియాడారు అదేవిధంగా ఫుడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిరంతరం చేస్తున్న అన్నదానాన్ని అభినందించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ఈ విధంగా ఆలోచించి వృధా ఖర్చు చేయకుండా వారి వారి పుట్టినరోజు పెళ్లి రోజులను పేదవారికి సహాయం చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో లోకేశ్వరం సర్వేయర్ సునీత్, రమేష్, సుధాకర్, భోజన, తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లిం సిబ్బందికి ఒక గంట ముందు సెలవు ప్రకటించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లిం సిబ్బందికి ఒక గంట ముందు సెలవు ప్రకటించాలని AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. ఈ విషయమై ఆదిలాబాద్ రిమ్స్ ఎడ్ సూపర్ వైజర్ బియ్యల రవికి వినతిపత్రం సమర్పించారు. రిమ్స్, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులలో పనిచేస్తున్న శనిటేషన్, పేసెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ ముస్లిం సిబ్బందికి రంజాన్ మాసంలో గంట ముందుగా సెలవు ప్రకటించాలన్నారు.లి ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ / ఎంప్లాయిన్ యూనియన్ రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి MD ఖాసీం యూనియన్ జిల్లా నాయకులు సైఫ్ ఖాన్, అఫ్నాన్, SD ఆరిఫ్, తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పదవ తరగతి బోర్డు పరీక్షల నిర్వహణలో పాల్గొనబోవు అధికారులు అందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అయా అధికారులంతా తమ తమ విధుల పట్ల క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలలో 9129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయని అన్నారు. అన్ని పరీక్షలను ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాకు చేరుకున్న పరీక్షల సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకై నియమించిన చీఫ్ సూపర్ ఇండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇతర అధికారుల వివరాలను తెలుసుకున్నారు. పరీక్ష, జవాబు పత్రాల తరలింపు సమయంలో తగిన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లాకు చేరుకున్న పరీక్షల సామాగ్రిని నిర్దేశిత ప్రదేశాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో త్రాగునీరు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ పొట్లాలు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల దగ్గర పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరుగుతున్నంతసేపు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా పరీక్షల సమయానికి తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం అయ్యే అధికారులందరికీ శిక్షణను ఇవ్వాలని తెలిపారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ పి. రామారావు, విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాజి మంత్రి వర్యాలు హరీష్ రావు నివాసం లో కలిసి యస్ సి వర్గీకరణ అంశం పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని విన్నవించడం



మాజీ మంత్రి హరీష్ రావు కు వినతి పత్రం అందజేత దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాజి మంత్రి వర్యాలు హరీష్ రావు నివాసం లో కలిసి యస్ సి వర్గీకరణ అంశం పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని విన్నవించడం . ఈ అసంబద్ధమైన యస్ సి వర్గీకరణ వల్ల మాలలకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో పార్టీ పక్షాన ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని కోరడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుండి 2024 రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయబడిన పథకాలు విద్యా, ఉద్యోగం స్వయం ఉపాధి, దళిత బంధు, దళిత బస్తి, రాజకీయ అన్ని రంగాలలో మాలలకు మాల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఎస్సీ వర్గీకరణను పునః సమీక్షించి 2024 జనాభా లెక్కల ప్రకారం మాలలకు న్యాయం జరిగే విధంగా ఎంపారికల్ డాట సేకరించి రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ చేయాలని మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ తరపున డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో యస్.సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ , రాష్ట్ర కన్వీనర్ బేర దేవన్న, రాష్ట్ర కో కన్వీనర్ సింగరి అశోక్, రాష్ట్ర కో కన్వీనర్ పాశం రాఘవేంద్ర, రాష్ట్ర కో కన్వీనర్ మేదరి స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు మలపతి సుభాష్, రాష్ట్ర కో కన్వీనర్ గులే సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివి..



జన్నారం :అమృత్ తెలంగాణ: ఎస్సీ వర్గీకరణ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో జాతి ఉద్యమమంలో ప్రాణత్యాగం చేయడం అనేది చాల గొప్ప విషయం అని వర్గీకరణ కోసం మాదిగలు చేసిన వారి త్యాగం ఎనలేనిదని ఎమ్మార్పీఎస్ జన్నారం మండల అధ్యక్షుడు కొండకూరి ప్రభుదాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఎస్సీ వర్గీకరణ కాదేమోనని కలత చెంది ప్రభుత్వాలకు కనువిప్పు ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేసి అమరవీరులుగ నిలిచిన తెలబండ్ల రవి మాదిగసిర్రా నాగేశ్వరరావు మాదిగ మీరా సాహెబ్ మాదిగ,గింజారపు ప్రభాకర్ మాదిగపొన్నాల సురేందర్ మాదిగనడిమిండ్ల దామోదర్ మాదిగములుగు మహేష్ మాదిగ దర్శనాల భారతి మాదిగపెద్దాడ ప్రకాష్ రావు మాదిగల త్యాగాలు మరువలేని అన్నారు వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ,ప్రధాన కార్యదర్శి జంగం రవి, జిల్లా నాయకులు మామిడి పెల్లి ఇందయ్య, దూమల్ల రమేష్,మంద రాజేష్,కొండుకురి ప్రశాంత్, దూమల్ల ప్రవీణ్,కుడుకల రాజేందర్, ఈర్నాల గంగన్న తదితరులు పాల్గొన్నారు.


## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా మార్చి 3వ తేదీ సోమవారంనాడు లెక్కింపు కొరకు విచ్చేయు కౌంటింగ్ ఏజెంట్లు, క్లరికల్ సిబ్బంది మరియు మీడియా మిత్రులకు ఇండోర్ స్టేడియంలోకి అనుమతించబడును.



ఈరోజు కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ భగత్ సింగ్ చౌరస్తా వద్ద స్థానిక నాయకులతో కలిసి టీ సేవిస్తూ ఎన్నికల పోలింగ్ సరళిపై చర్చించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గారు..

అమృత్ తెలంగాణ కరీంనగర్ న్యూస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా మార్చి 3వ తేదీ సోమవారంనాడు లెక్కింపు కొరకు విచ్చేయు కౌంటింగ్ ఏజెంట్లు , క్లరికల్ సిబ్బంది మరియు మీడియా మిత్రులకు అంబేద్కర్ స్టేడియం నందు గల గేట్ నంబర్ -1 నుండి లోపలికి ప్రవేశించి నిర్దేశించబడిన ప్రదేశంలో వారి వాహనాలను పార్కింగ్ చేసుకుని, గేట్ నంబర్ - 4 ద్వారా అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలోకి అనుమతించబడును. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మార్చి 3వ తేదీ సోమవారంనాడు స్థానిక కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం నందు నిర్వహించనున్నారు. దీనికిగాను తీసుకునే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మరియు ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకుగాను ట్రాఫిక్ పోలీసులచే జారీ చేయబడిన నియమాలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ బి. యాదగిరి స్వామి సూచించారు. ఓట్ల లెక్కింపు కొరకు విచ్చేయుకౌటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు మరియు కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వచ్చే మీడియా మిత్రులు అందరికి అంబేద్కర్ స్టేడియం నందు గల గేట్ నంబర్ -1 ద్వారా మాత్రమే లోపలికి ప్రవేశించి నిర్దేశించబడిన ప్రదేశంలో వారి వాహనాలను పార్కింగ్ చేసుకుని, గేట్ నంబర్ -4 ద్వారా అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలోకి అనుమతించబడునని ట్రాఫిక్ ఏసీపీ బి. యాదగిరి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది మరియు మీడియా మిత్రులు గమనించి సహకరించాలని వారు కోరారు.

## ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం)కార్డు కొరకు యుడిఐడి పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తెలిపారు.





వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్న జిల్లా అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్లు, ఇతర అధికారులతో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ, సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యుడిఐడి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ, విఎల్ఇ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితోపాటు యుడిఐడి పోర్టల్ , స్వంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపుల వివరాలు కూడా మెసేజ్ ల ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమల్లోకి తీసుకురావడం జరిగిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యుడిఐడి (యూనిక్ డిజేబిలిటీ ఐడి) కార్డును పొందవచ్చని తెలిపారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో సదరం క్యాంపులను నిర్వహించేందుకు 38 మెడికల్ బోర్డులను గుర్తించడం జరిగిందని, సదరం. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు కొరకు రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియపై మీసేవ నిర్వాహకులకు శిక్షణను ఇవ్వాలని సూచించారు. అలాగే పీఎం కుసుం ప్రాజెక్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామీణ మహిళా సంఘాలను ప్రోత్సహించాలని తెలిపారు. దరఖాస్తు స్వీకరించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ వీడియో కన్ఫరెన్స్ లో కలెక్టర్ కార్యాలయం నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నార్నూర్ బ్లాక్ కు డెల్టా ర్యాంకింగ్ నిధుల క్రింద విద్య, అంగన్వాడీ , సమాజ అభివృద్ధి కార్యక్రమాల ప్రపోజల్ కు సంబంధించి శనివారం సంబంధిత అధికారులతో జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో విద్యా, మహిళా శిశుసంక్షేమశాఖ, ట్రైబల్, నీతి అయోగ్ కో ఆర్డినేటర్ లతో నార్నూర్ బ్లాక్‌కు డెల్టా ర్యాంకింగ్ నిధుల క్రింద విద్య, అంగన్వాడీ సమాజ అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయని వివిధ శాఖల కు సంబంధించి పనుల వివరాల ప్రపోజల్ మూడు రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. RO ప్లాంట్ ఏర్పాటు, ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు స్థల సేకరణ, అంగన్వాడి కేంద్రాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, ప్లే మెటీరియల్, ఔట్ డోర్ ప్లే మెటీరియల్, న్యూట్రిషన్ గార్డెన్, డిజిటల్ క్లాస్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, తదితర అంశాల పై ప్రపోజల్ సమర్పించుటకు సంబంధిత అధికారులతో వివరంగా చర్చించి , రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశం లో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## హైకోర్ట్ జడ్జి జస్టిస్ రేణుకా యారా అదిలాబాదు చేరుకున్న సందర్భంగా స్థానిక పెన్ గంగా గెస్ట్ హౌస్ లో పూలమొక్కలు అందించి స్వాగతం పలికిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర రావు, జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం.









హైకోర్ట్ జడ్జి జస్టిస్ రేణుకా యారా అదిలాబాదు చేరుకున్న సందర్భంగా శనివారం స్థానిక పెన్ గంగా గెస్ట్ హౌస్ లో పూలమొక్కలు అందించి స్వాగతం పలికిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర రావు, జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అనంతరం తెలంగాణ హై కోర్ట్ న్యాయమూర్తి శ్రీమతి. జస్టిస్ రేణుక యారా జిల్లా కోర్ట్ ప్రాంగణం నందు అవుట్ పేషెంట్ డిస్పెన్సరీని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ము ఖ్య అతిథి గా హాజరైన తెలంగాణ హై కోర్ట్ న్యాయమూర్తి శ్రీమతి. జస్టిస్ రేణుక యారా మాట్లాడుతూ అవుట్ పేషెంట్ డిస్పెన్సరీ సదుపాయాన్ని కోర్ట్ ప్రాంగణం లోని న్యాయ సిబ్బంది,కోర్ట్ కి వచ్చే కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం లోజిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీమతి సౌజన్య ,రిమ్స్ డైరెక్టర్ డా.రాథోడ్ జైసింగ్, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏంరాలనగేష్ ,డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి శ్రీమతి డా. సాధన డా.మిత్రపెల్లి శ్రీధర్,డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డా.భూమయ్య పాల్గొన్నారు

## ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంజయ్ నగర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. పూర్వ ఏబీవీపీ నాయకులు దివంగత ధర్మేందర్ సింగ్ జ్ఞాపకార్థం ఖాల్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఏబీవీపీ విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ముందుంటుందని ఖాల్సా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సోహన్ సింగ్ అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏబీవీపీ పట్టణ అధ్యక్షులు డాక్టర్. రవికుమార్ అన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఖడ్సే అక్షయ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కాలం చెల్లిన కమ్యూనిటీ సిద్ధాంతాలు నేటి ఆధునిక కాలానికి పని చేయవని పేర్కొన్నారు. విద్యార్థులందరూ జాతీయ భావాలు పెంపొందించుకొని దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖాల్సా ఎడ్యుకేషనల్ కమిటీ మెంబర్ పురుషోత్తం, కేజీబీవీపీ ఇన్చార్జి ప్రిన్సిపల్ సంతోషి రూప జిల్లా కోకన్వీనర్ నిఖిల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మేకల మహేష్, ఏబీవీపీ జిల్లా నాయకులు అరుణ్, ఉదయ్ సామాజిక కార్యకర్త అరవింద్ పాల్గొన్నారు.




## పదవీ విరమణ అధికారులకు సన్మానం చేసిన నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఈ రోజు ఉదయం నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఎల్. దేవ్ రావ్ ఏఎస్ఐ మరియు ఎ.లక్ష్మా రెడ్డి ఏఎస్ఐ గారిని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ పూలమాల, శాలువ, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పి డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ గారు మాట్లాడుతూ ఎన్నో రకాల త్యాగాలతో పాటు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు సుమారు 36సంవత్సరాల పాటు సర్వీస్ పూర్తి చేసిన ఏఎస్ఐగా సేవలను అందించిన

వారి సర్వీస్ గురించి ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ డి.ఉపేందర్ రెడ్డి, ఏఓ యం.డి.యునుస్ అలి,పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగ రంగా వైభోగంగా శివపర్వాతుల కళ్యాణం..



కుబీర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని ఫార్డి బి గ్రామములో గత ఎన్నో సంవత్సరాల కాలం నుండి అనవహితీ గా వస్తున్నా ఆచారాన్ని పక్కన పెట్టకుండా ప్రతి ఏడాదిలో శివరాత్రికి ఐదు రోజుల పాటు నిర్వహించే వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. దింతో శు క్రవారం అమవస్య సందర్భంగా శు క్రవారం రాత్రి 12గంటలకు శివపర్వాతుల కల్యాణమహోత్వని ఘనంగా జర్పించారు. శివపర్వాతులకు వేద పండితులు దత్తాత్రి మహారాజ్ మాత్రోచారణలతో కళ్యాణం జర్పించడానికి గ్రామస్తులతో పాటు చుట్టూ ప్రక్కల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై శివ పార్వతులకు వివహం జర్పంచారు. దింతో ఈ గ్రామంలో శివ పార్వతుల పెండ్లి జరిపించిన తర్వాతనే గ్రామంలో ఏదైనా శుభాకార్యాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు తెలిపారు.

## ఐఐటి కందిలో ఉపరాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం



కలెక్టర్ మాధురి ,అదనపు ఎస్పీ సంజీవ్ రావు ,డిస్పీ సత్తియ్య గౌడ్ ,ఆర్ డి ఓ రవీంధర్ రెడ్డి , డి పి ఓ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

కంది :అమృత్ తెలంగాణ: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ , ఆదివారం మండల కేంద్రంలోని ఐఐటి కంది హైదరాబాద్ కు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ బివిఎస్ మూర్తితో కలిసి హెలిపాడ్, సమావేశ స్థలం ను పరిశీలించారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు నిర్దేశించాలన్నారు. ముఖ్యంగా వీఐపీ పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిపాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడీ కార్డుల పంపిణీ తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశ ప్రాంతంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని,అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలని, అంబులెన్స్ లో అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు

## కలప అక్రమ రవాణాపై ఉక్కు పాదం..



జన్నారం :అమృత్ తెలంగాణ: గకు పాల్పడితే సహించేది లేదని, వారిపై ఉ క్కు పాదం మోపుతామని, అలాంటి వ్యక్తులు ఎంతటి వారైనా వదిలేది లేదని జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు స్పష్టం చేశారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా ఇతరులకు అనుమానం రాకుండా కలప స్మగ్లింగ్కు పాల్పడినట్లు సమాచా రం ఉ ంటే తనకు నేరుగా కాని, ఫోన్లో కాని సమాచా రం ఇవ్వాలన్నారు , అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉ ంచుతామన్నారు. అడవిని కాపాడుకుంటే మానవుని మనుగడకు ఎంతగానో ఉ పయోగపడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. అదే విధంగా దొంగచాటుగా వాగులు, వంకలు, గోదావరి నుంచి కొందరు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని, అలాంటి వారి ట్రాక్ట ను ఖచ్చితంగా పట్టుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ అవసరాలకు మా త్రమే ఇసుకను అనుమతించడం జరుగుతుందని, ఆ విషయాన్ని కూడా తమ ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు రాత్రి వేళలో ఇసుకను ఇతర ప్రాంతా కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం ఉందని, వారిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. 1967 అటవీ సంరక్షణ చట్టం, అలాగే 1972 వన్య ప్రాణి సంరక్షణ చట్టంప్రకారం ఆంక్షలను అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సుష్మారావు తెలిపారు.

# విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (అటానమస్) లో కాస్మిక్ కనెక్షన్స్ అనే అంశంపై టెడ్స్ ఎక్స సీజన్-2 ఈవెంట్.







భీమవరం అమృత్ తెలంగాణ: మార్చ్ 1. డాక్టర్ బి.వీ.రాజు ఫౌండేషన్ మరియు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో శనివారంటెడ్స్ విష్ణు ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో కాస్మిక్ కనెక్షన్స్ అనే అంశంపై టెడ్స్ ఎక్స సీజన్-2 ఈవెంట్ విజయవంతంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు తెలియజేశారు. ఈ సందర్భంగా, ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పుస్తకాలకే పరిమితం కాకుండా ఇలాంటి ఈవెంట్స్‌లో పాల్గొని ప్రత్యక్ష ప్రసంగాల ద్వారా లోతైన చర్చలు జరిపి కొత్త కనెక్షన్లు ఏర్పరచుకోవాలని సూచించారు. టెడ్స్ సీజన్-1 ఈవెంట్ 2024 ఫిబ్రవరిలో నిర్వహించబడిందని, ఇదే విధంగా టెడ్స్ సీజన్-2 ఈవెంట్ కూడా విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెడ్స్ విష్ణు ఇన్స్టిట్యూట్ ఆర్గనైజర్ మిస్టర్ సూరజ్ లంకేయ్ మాట్లాడుతూ, టెడ్స్ ఈవెంట్ అనేది స్థానిక సమావేశం అని, ఇందులో టెడ్ తరహా ప్రత్యక్ష ప్రసంగాలు మరియు ప్రదర్శనలు కమ్యూనిటీతో పంచుకోబడతాయని వివరించారు. అలాగే, టెడ్స్ ఈవెంట్‌లు పూర్తిగా స్వతంత్రంగా ప్రణాళికాబద్ధంగా మరియు సమన్వయంతో కమ్యూనిటీ ఆధారంగా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెడ్స్ విష్ణు ఇన్స్టిట్యూట్ కో-ఆర్గనైజర్ వైష్ణవి దశిక మాట్లాడుతూ, సీజన్-1 "ఇన్ఫినిటీ ట్రేడ్స్" అనే అంశంపై టెడ్స్ టాక్స్ నిర్వహించబడినట్లు, సీజన్-2 "కాస్మిక్ కనెక్షన్స్" అనే అంశంపై టెడ్స్ టాక్స్ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా, ఆమె టెడ్స్ తో తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. అలానే, టెడ్స్ విష్ణు ఇన్స్టిట్యూట్ క్యురేటర్ ఆకాష్ రావు మల్లారెడ్డి మాట్లాడుతూ, టెడ్స్ అనేది టెడ్ లాంటి అనుభవాన్ని పంచుకోవడానికి వ్యక్తులను ఒక్క చోట చేర్చే స్థానిక, స్వీయ-వ్యవస్థీకృత ఈవెంట్స్ ప్రోగ్రామ్ అని వివరించారు. టెడ్స్ టాక్స్ ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛంద సేవకులు నిర్వహించే టెడ్ తరహా కార్యక్రమాలని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా, టెడ్స్ స్పీకర్స్ అయిన టులిప్ గ్రూప్ పార్టనర్ మిస్టర్ సందీప్ ఇజ్రాని, ఈస్ట్ వెస్ట్ సీడ్స్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ హెడ్ మిస్టర్ బీజాయ్ బైరాగి, ఇన్స్పైరె ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ / సీఈఓ డాక్టర్ జె.వి.ఎస్. భాస్కర్, ఫిట్నెస్ ఇన్ఫ్లుయెన్సర్ మిస్టర్ ఈశ్వర్ బోలెగర్, "అమ్మ డైరీలో కొన్ని పేజీలు" నవల రచయిత మిస్టర్ రవి మంత్రి, ఫోర్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ / సీఈఓ మాస్టర్ రౌల్ హండా, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్సల్టెంట్ మిస్ సాహితి దివీ, ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ మిస్టర్ కౌశిక్ మరిదీ తదితరులు తమ ప్రసంగాల ద్వారా తమ ఆలోచనలను, అభిప్రాయాలను విద్యార్థులతో పంచుకున్నారు. చివరిగా ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ అఫ్ టెడ్స్ విష్ణు ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ శ్రీ లక్ష్మి ఈవెంట్ కి వోట్ అఫ్ థాంక్స్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. శ్రీ లక్ష్మి, డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# విద్యార్థులలో సైన్స్ , టెక్నాలజీ , ఇంజనీరింగ్ , మాథమాటిక్స్ అండ్ మెడిసిన్ లో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు రెండు రోజుల కార్యక్రమం.

భీమవరం అమృత్ తెలంగాణ: మార్చ్ 1. డా.బి.వి.రాజు ఫౌండేషన్ , శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "పశ్చిమగోదావరి జిల్లా,ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాల విద్యార్థులలో సైన్స్ , టెక్నాలజీ , ఇంజనీరింగ్ , మాథమాటిక్స్ అండ్ మెడిసిన్ లో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించే ప్రదర్శన" అనే అంశం పై రెండు రోజుల కార్యక్రమం 28వ ఫిబ్రవరి 1వ మార్చ్ 2025న శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాల లో నిర్వహించబడింది . ఈ కార్యక్రమం డి ఎస్ టీ , ఎన్ .సి . ఎస్ టీ .సి ప్రాజెక్ట్ లో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్స్ అయిన ఏ కె ఆర్ జి హై స్కూల్ నుంచి 8వ మరియు 9వ తరగతి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మొదటగా , విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్యం , ఆరోగ్య పరీక్షలు మరియు ఇన్ఫెక్షన్ నివారించడంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పూర్తిగా వివరించబడింది . అనంతరం , విద్యార్థులకు వివిధ డయాగ్నొస్టిక్ సాంకేతికతలను ప్రదర్శించబడింది . ఇందులో బ్లడ్ గ్రూపింగ్ , హెమోగ్లోబిన్ , బీపీ పరీక్షలు నిర్వహించబడ్డాయి . కళాశాల లో వివిధ లాబ్స్ ను సందర్శించి ఫార్మస్యూటికల్స్ తయారీ లో వివిధ అంశాలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా . కె.ఎస్.నటరాజ్ , ప్రాజెక్ట్ పరిశోధకులు డా . ఎస్ .అనిల్ కుమార్ , డాక్టర్ రఘు బాపి రాజు, బి.వి.రాజు నాలెడ్జి సెంటర్ సిబ్బంది మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అడ్మిన్ డైరెక్టర్ జె ప్రసాద రాజు అద్వర్యం లో నిర్వహించబడింది

# మాటల కోతలు నిధుల కోతలు




అమరావతి : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్లో మాటల కోతలు, నిధుల కోతలు తప్ప ప్రజలకు ప్రాధాన్యత లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. శనివారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాల్లో ప్రజలను పట్టించుకోలేదని, నిజాయితీ లేదని అన్నారు. ఆదాయం పెరుగుతుందని చెప్పిన లెక్కలన్నీ మోసపూరితమని చెప్పారు. అంచనాలు ఎక్కువచేసి చూపించి, ఏడాది చివర ఇచ్చే సవరణ అంచనాల్లో తగ్గించేస్తున్నారని, ప్రతిసారీ ఇదే జరుగుతోందని అన్నారు. ఇది ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటికాదని విమర్శించారు. రూ.15 వేల కోట్ల సొంత పన్నులు పెరుగుతాయంటే ప్రజలపై భారం వేయడమేనని చెప్పారు. పన్నేతర ఆదాయం రూ.7 వేల కోట్ల నుండి రూ.19 వేల కోట్లకు పెంచారని, వాటికోసం భూములు అమ్ముతారా? ఎర్రచందనం అమ్ముతారా ? సారా తాగించి తెస్తారో సమాధానం చెప్పాలన్నారు. మొత్తం పన్నుల్లో కేంద్రం వాటా రూ.52 వేల కోట్ల నుండి 57 వేల కోట్లకు పెరుగుతుందని పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన 15 ఏళ్లలో ఐదువేల కోట్లు ఒకేసారి ఎప్పుడూ పెరగని విషయాన్ని గుర్తు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.10 వేల కోట్లు పెరుగుతుందని లెక్కల్లో చూపించారని, గతంలోనూ ఇలా పెంచి చూపించడం, సంవత్సరాంతంలో తగ్గించడం ప్రజలను మభ్యపెట్టడం కాదా అని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో బడ్జెట్ ప్రారంభంలోనే మూడు ఎగిరిపోయాయని, మిగిలిన మూడు పథకాలు సగం నిధులకే పరిమితం అయ్యాయని అన్నారు. అంటే, లబ్దిదారుల్లో కోత పెట్టడం, సంక్షేమ పథకాలు కుదించడం, లేదా బకాయిలు పెట్టడం వంటి చర్యలకు దిగుతారని చెప్పారు. 'మహిళలకు నిధులు లేవు.., యువతకు ఉపాధి లేదు' అని వ్యాఖ్యానించారు. మొదటి సంతకం పెట్టిన డిఎస్‌సిని మరలా వాయిదా వేసిన ప్రభుత్వం వర్గీకరణను సాకుగా చూపడం సరికాదన్నారు. మొత్తం ఉద్యోగాలు ఎగ్గొంటేందుకు దీన్ని సాకుగా ఉపయోగించుకుంటున్నారని వివరించారు. రూ.48 వేల కోట్లు వ్యవసాయ బడ్జెట్ చూపించి 22 శాతం గ్రోత్‌రేట్ ఉంటుందని చెప్పడం కంటి తుడుపు మాటలేనని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులో పోలవరానికి ఆరువేల కోట్ల చూపించారని, అది పూర్తవ్వాలంటే రూ.60 వేల కోట్లు అవసరం ఉంటుందని చెప్పారు. నిర్వాసితులకు రూ.30 వేల కోట్లపైబడి ఇవ్వాలని, అంచనాల పెరుగుదల ఉందని దానికి తగిన విధంగా కేటాయింపులు లేవని వివరించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వెలిగొండ, హంద్రీనీవాకు కూడా కేటాయింపులు సరిగా లేవని చెప్పారు. రూ.1,400 కోట్లు ఖర్చు పెడితే వెలిగొండ టన్నెల్ పూర్తవుతుందని అలా చేయకుండా కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. మార్చి నుండి మే నెల వరకూ పొయ్యిమీద పెనంలా ఉంటుందని వార్తలు వస్తున్నాయని, ఇప్పటికే 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని వేసవి తీవ్రతతో కోస్తా తీవ్రపరిస్థితిని ఎదుర్కోబోతోందని చెప్పారు. అయినా బడ్జెట్లో ఎక్కడా ప్రజలను ఆదుకునే లెక్కలు కనిపించడం లేదని విమర్శించారు. 'ఐదేళు వాళ్లు దోచుకున్నారు.. ఇప్పుడు మేము దోచుకుంటాం' అనే విధంగా ప్రభుత్వ తీరు ఉందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్రం నుండి రావాల్సిన నిధుల్లో రాష్ట్ర వాటాను పెంచాలని బడ్జెట్లో ఎక్కడా కోరలేదని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం రాష్ట్రాలకు 32 శాతం వాటా ఇస్తోందని, దీన్ని 50 శాతానికి పెంచాలని అలా చేయకుండా రాష్ట్రాలను మోసం చేస్తుంటే నిధులు ఇవ్వాలని బడ్జెట్లో ప్రస్తావించకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కేంద్ర 50 శాతం వాటా రాష్ట్రాలకు ఇస్తే రాష్ట్రంలో చాలా వరకూ సమస్యలు తీరుతాయని చెప్పారు. అయినా రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తున్నా దాని గురించి మాట్లాడకపోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడే పద్ధతిలో బడ్జెట్‌ను సవరించి నిధులు కేటాయింపులు చేయాలని కోరారు.

మూలధన వ్యయాన్ని తగ్గించుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, గత ప్రభుత్వంలోనూ ఇదే పద్ధతి అనుసరించారని తెలిపారు. పి4 పేరుతో పేదవాళ్లను ధనవంతులు దత్తత తీసుకునే కార్యక్రమం పెట్టారని, అక్కడ ఒక 'పి' ఎగిరిపోయిందని తెలిపారు. రూ.20 వేల కోట్లు వయబులిటీగ్యాప్ ఫండింగ్ పేరుతో మరో 'పి'ని ఎత్తేశారని అన్నారు. మొత్తంగా పి4 పేరుతో ప్రభుత్వం ప్రజల బాధ్యత నుండి తప్పుకునే కార్యక్రమం చేస్తోందని అన్నారు. పైగా వయబులిటీ గ్యాప్ ఫండింగ్‌కు రూ.20 వేల కోట్లు కేటాయించారని, ఇవి ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదారులకు అప్పగించడమేనని స్పష్టం చేశారు. ఇది క్రోనీ క్యాపిటలిజానికి నిదర్శనమని చెప్పారు.

# ఒకే ఏడాది ఇన్ని ఎలా సాధ్యం అమ్మడు..!



మెయిన్ లీడ్ హీరోయిన్‌గా చేయాలనే ఆసక్తి ఈమె కనబర్చడం లేదు. వచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. సుధీర్ బాబు హీరోగా పదేళ్ల క్రితం వచ్చిన 'భలే మంచి రోజు' సినిమాలో హీరోయిన్‌గా నటించిన ముద్దుగుమ్మ వామికా గబ్బీ తెలుగు ప్రేక్షకులకు పెద్దగా గుర్తుండి ఉండదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తుంది. కెరీర్ ఆరంభంలో జూనియర్ ఆర్టిస్టుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన వామికా గబ్బీ ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. హీరోయిన్‌గా వామికా గబ్బీ ఇటీవలే బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించినప్పటికీ మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. మెయిన్ లీడ్ హీరోయిన్‌గా చేయాలనే ఆసక్తి ఈమె కనబర్చడం లేదు. వచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. అందుకే ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. గత ఏడాది ఈమె నటించిన సినిమాలు బేబీ జాన్ తప్ప మరేది విడుదల కాలేదు. అందుకే ఈమధ్య కాలంలో వచ్చిన ప్రతి ఆఫర్‌కి ఓకే చెప్పింది. దాంతో ఈమె చేతిలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పది సినిమాలు ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. త్వరలోనే ఈ అమ్మడు నటించిన సినిమాలు బ్యాక్ టు బ్యాక్ రాబోతున్నాయి. %ూశ్రీంశీ =ఝు% - 4.5 లక్షల గౌను 82 వేలకే అంటే ఎగబడితే ఇలా! తెలుగులో భలే మంచి రోజు సినిమా తర్వాత ఇప్పటి వరకు నటించలేదు. ప్రస్తుతం అడవి శేష్‌తో కలిసి గూఢచారి 2 సినిమాలో నటిస్తుంది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి కానుంది. సమ్మర్ చివరి వరకు లేదా ఆగస్టులో సినిమాను విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. వామికా గబ్బీ తెలుగు సినిమాతో పాటు తమిళ్, పంజాబీ, హిందీ సినిమాల్లోనూ నటిస్తోంది. ఒకే సారి ఇన్ని భాషల్లో నటిస్తున్న హీరోయిన్ ఈమె అంటూ నెటిజన్లు అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల్లో సగం సక్సెస్ అయినా పదేళ్ల పాటు ఈ అమ్మడి సినీ జర్నీ జెట్ స్పీడ్‌తో సాగుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయం

# ప్రభాస్ ఫౌజీలో హాలీవుడ్ యాక్టర్



రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఫౌజీ. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే అందరికీ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఇమాన్వీ ఇస్మాయెల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా గురించి ప్రస్తుతం నెట్టింట ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. ఫౌజీలో రజాకార్ల నేపథ్యంలో సాగే ఓ భారీ ఎపిసోడ్ ఉంటుందట. ఈ సీక్వెన్స్ సినిమాలోనే హైలైట్ గా నిలవనుందని అంటున్నారు. ఈ విషయం బయటికొచ్చిన దగ్గర నుంచి అందరికీ ఫౌజీపై ఇంట్రెస్ట్ పెరుగుతుంది. ఫౌజీలో రజాకార్ల ఎపిసోడ్ లో ఎమోషన్స్ కు, యాక్షన్ కు పెద్ద పీట వేయబోతున్నారని దానికి సంబంధించిన సీన్స్ ను మార్చిలో షూట్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ ఎపిసోడ్ లో ఓ కీలక పాత్ర ఉందట. ఆ కీలక పాత్ర కోసం ఓ హాలీవుడ్ యాక్టర్ ను రంగంలోకి దింపుతున్నాడట డైరెక్టర్ హను. సదరు నటుడు ఆ పాత్ర కోసం దాదాపు ఆరు నెలలుగా మేకోవర్ అవుతున్నాడని తెలుస్తోంది. అయితే ఆ హాలీవుడ్ యాక్టర్ ఎవరనేది చిత్ర బృందం త్వరలోనే అనౌన్స్‌చేయనుందట. మొత్తానికి ఫౌజీ కోసం హను ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు, ఫౌజీలో పవర్‌ఫుల్ ఫ్లాష్ బ్యాక్ ఉందని, మునుపెన్నడూ చూడని యాంగిల్ లో ప్రభాస్ ఈ ఫ్లాష్ బ్యాక్ లో కనిపించనున్నాడని తెలుస్తోంది. ఈ ఫ్లాష్ బ్యాక్ లో మరో హీరోయిన్ కూడా నటించనుందని వార్తలొస్తున్నాయి. మరి అందులో నిజమెంతన్నది తెలియదు. ఏదేమైనా ఫౌజీ సినిమా ఏదొక అప్డేట్ తో నిరంతరం వార్తల్లో నిలుస్తూనే ఉంది.


# నా కెరీర్ లాంటి కేస్ స్టడీ ఇంకొకటి లేదు.



అప్పటి నుంచి తన సినిమాలతో అలరిస్తున్నారు. ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్.. తనకంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్థానం మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన టాలెంటెడ్ హీరో.. స్నేహగీతం చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత రొటీన్ లవ్ స్టోరీ సినిమాతో సోలో కథానాయకుడిగా తన కెరీర్ స్టార్ట్ చేశారు. అప్పటి నుంచి తన సినిమాలతో అలరిస్తున్నారు. ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. "నేను ఇండస్ట్రీలోకి వచ్చి 15 ఏళ్లు అవుతుంది.. బ్యూటిఫుల్ జర్నీ నేను ఎంబీఏ చదువుకున్నా.. నాకు కేస్ స్టడీస్ అంటే ఇష్టం.. ఒక కంపెనీ ఎలా ఉండేది.. ఎలా పడిపోయింది.. ఎలా లేచింది.. ముందుకు ఎలా వెళ్లగలదు.. ఏం చేయొచ్చు.. అనే అంశాలను నేను చదువుతా.. నా కెరీర్ అంతా యూనిక్" అని సందీప్ కిషన్ చెప్పుకొచ్చారు. "నా కెరీర్ లాంటి కేస్ స్టడీ ఇంకొకటి లేదు.. ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నా.. నేను చాలా మారాను.. ఇప్పుడు ఈరోజు ఒక గ్రేట్ డే.. బాధ్యత గల వ్యక్తిగా మారాను.. కొన్నేళ్ల క్రితం వ్యక్తికి ఇప్పుడికి చాలా డిఫరెన్స్ ఉంది.. 2010 ప్రస్థానం నుంచి 2014 వరకు బాగా సాగింది.. ఆ తర్వాత కాస్త బ్యాడ్ డేస్ వచ్చాయి" అని తెలిపారు. "కెరీర్ లో ఇంకొంచెం బాగా చేస్తే బాగుంటుందని అనిపిస్తుంటుంది. అది కెరీర్ లో ఆ మాత్రం ఉండాలి.. చాలా మంది పోరాడుతున్నామని చెప్తారు. కానీ నేను అలా కాదు.. 15 ఏళ్ల నేను ఎప్పుడూ టాప్ డైరెక్టర్‌తో పని చేయలేదు, బ్లాక్ బస్టర్ ట్రెండ్ ను అనుసరించలేదు. టాప్ బ్యానర్ తో ఎప్పుడూ అనుబంధం కలిగి లేను " అని చెప్పారు. "అనిల్ గారు రెస్పెక్ట్ ఇచ్చారు.. స్పేస్ కన్నా గౌరవం ఇస్తున్నారు.. అది నాకు ఇష్టం.. అందుకే మళ్లీ ఆయనతో పని చేస్తున్నాను అని చెప్పారు. ఆ తర్వాత సినిమా ప్రమోషన్స్ కోసం మాట్లాడారు సందీప్. సినిమా ఫంక్షన్స్ కు సెలెబ్రెటీలు తీసుకురావడం కష్టమని హోస్ట్ అనగా.. అది ప్రతి రోజు కష్టమని తెలిపారు

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# సీకే దేవత దెబ్బకు నగరంలో కర్ఫ్యూ




లోదుస్తుల కంపెనీ లాభాల్ని స్కైలోకి చేర్చిన దిశా పటానీ, తాజాగా మరోసారి సీకే బ్రాండ్ లోదుస్తుల్లో విజృంభించింది. ప్రఖ్యాత కెల్విన్ క్లెయిన్ బ్రాండ్ అంబాసిడర్ గా దిశా పటానీ యూత్ గుండెల్లో నిదురిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా టీనేజీ, కాలేజీ బోయ్స్ నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ ఏజ్ తో సంబంధం లేకుండా అందరికీ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడమెలానో దిశాకు బాగా తెలుసు. అందుకే సీకే కంపెనీ ఈ భామను ఎప్పటికీ విడిచిపెట్టడం లేదు. 2020 కరోనా క్రైసిస్ కి ముందు నుంచే సీకే బ్రాండ్ కి దిశా పటానీ ప్రచారం చేస్తోంది. నాలుగేళ్లుగా ఈ బ్రాండ్ ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఘనత నిరభ్యంతరంగా దిశాకే చెందుతుంది. లోదుస్తుల కంపెనీ లాభాల్ని స్కైలోకి చేర్చిన దిశా పటానీ, తాజాగా మరోసారి సీకే బ్రాండ్ లోదుస్తుల్లో విజృంభించింది. రకరకాల ఇన్నర్ దుస్తుల్లో దిశా పటానీ ఫోజులు ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. "మీ రోజువారీ భ్రమణం ఇలా మొదలవ్వాలి! అంటూ దిశా పటానీతో సీకే బ్రాండ్ ప్రచారం చేయిస్తోంది. కాల్విన్ క్లైన్ లోదుస్తులతో దిశా సీజన్‌ను ప్రారంభిస్తుంది. ఐకానిక్ కంఫర్ట్ లుక్ ఇదిగో అంటూ యూత్ ని టీజ్ చేసింది ఇన్‌స్టాలో దిశా పటానీ సీకే లోదుస్తుల్లో ఒంపుసొంపులు ప్రదర్శించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. ఇవన్నీ అంతర్జాలంలో క్షణాల్లో వైరల్ అయ్యాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com